క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దివాకర్‌రెడ్డి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని పాతాళగంగ రోడ్డు మార్గంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నాగన్న అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా గురువారం దాడులు చేసి పట్టుకున్నట్లు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ..విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు, వీఆర్వో ప్రదీప్‌తో కలిసి దాడులు నిర్వహించామన్నారు. నాగన్న వద్ద 154 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నాగన్నను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు పోలీసు బందోబస్తు



ముచ్చుమర్రిలో పోలీసుల కవాతు

నందికొట్కూరు: పగిడ్యాల మండల పరిధిలోని ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె గ్రామాల్లో జరిగే విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు ఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో వీధుల వెంట ఎస్‌ఐ, పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

శ్రీశైలం ఆలయంపై చాపర్ ఫ్లైట్ చక్కర్లు



ఆలయ పరిసర ప్రాంతాల్లో చక్కర్లు కొడుతున్న చాపర్‌ఫ్లైట్

శ్రీశైలం: శ్రీశైలం ఆలయ పరిసరాలు, ఆలయంపైన గురువారం చాపర్‌ఫ్లైట్ పలుమార్లు చక్కర్లు కొట్టడంతో దేవస్థానం అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. రెండు వారాల క్రితం ఆలయం, డ్యాం పరిసరాల్లో డ్రోన్ చక్కర్లు కొట్టడం, ప్రస్తుతం చాపర్ ఫ్లైట్ సంచరించడంతో భక్తులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం సర్వేలో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా శ్రీశైలం సున్నిపెంట, భూముల ఛాయాచిత్రాలను స్వీకరించేందుకు ఎయిర్‌క్రాఫ్ట్‌ను వినియోగించినట్లు నంద్యాల జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్‌మోహన్ వివరించారు.

సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం



గ్రామపంచాయతీకి వచ్చిన అవార్డులతో సర్పంచ్, కార్యదర్శి, గ్రామస్తులు

జూపాడుబంగ్లా: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పారుమంచాల గ్రామానికి ఏడు అవార్డులు రావటంతో గ్రామసర్పంచ్ మాధవరం ప్రకాశం, కార్యదర్శి పార్థసారథిని గురువారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాశం, కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామప్రజల సహకారంతో గ్రామానికి ఏడు అంశాల్లో అవార్డులు రావటం సంతోషించ దగిన విషయమన్నారు. కార్యక్రమంలో కర్ణ, రసూల్, వార్డు మెంబర్ నాగన్న, చిన్నజాఫర్ మియ్యా, గ్రంధి చిన్నబాబు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రంచన్‌గా పింఛన్

- బాబుపాలనలో తిండీతిప్పలు మానుకొని కార్యాలయాల వద్ద పింఛన్ కోసం ఎదురుచూపులు
- జగనన్న అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే వచ్చి నగదు అందజేత
- ప్రతి నెల 1వ తేదీనే తెల్లవారకముందే పంపిణీ
- ఈనెల ఆత్మకూరు డివిజన్ పరిధిలో 64,081 మందికి పంపిణీ

జూపాడుబంగ్లా: టీడీపీ పాలనలో పింఛన్ ఎప్పుడిస్తారో తెలియక వృద్ధులు, వికలాంగులు, అక్కా, చెల్లెమ్మలు సచివాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. అధికారులు ఎప్పుడు వస్తారో తెలియక తిండీతిప్పలు మానుకొని ఎదురుచూడాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయ్యాక ప్రతి నెల ఒకటోవ తేదీ వచ్చిందంటే చాలు తెల్లవారకముందే వలంటీర్లు తలుపు తట్టి రంచన్ పింఛన్ నగదును వారి చేతుల్లో పెడుతుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా లబ్ధిదారులు ఆసుపత్రుల్లో ఉన్నా, పనులకు వెళ్లినా అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తూ వలంటీర్లు ప్రశంసలు అందుకుంటున్నారు.

గతంలో ఎప్పుడిస్తారో తెలియక అవస్థలు

టీడీపీ పాలనలో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అధికారులు ఎప్పుడు వస్తారా.. పింఛన్ ఎప్పుడు ఇస్తారా అంటూ లబ్ధిదారులు తిండీ తిప్పలు మానుకొని ఎదురుచూసేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థను ఏర్పాటుచేసి పింఛన్ నగదుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటివద్దకే అందజేస్తున్నారు. దీనికి



తాటిపాడులో తెల్లవారకముందే లబ్ధిదారురాలికి నగదు అందజేస్తున్న వలంటీరు

తోడు పింఛన్ మొత్తాన్ని ప్రతి ఏటా రూ.250ల చొప్పున పెంచుతానని ఇచ్చిన మాట మేరకు ఏటా రూ.250ల చొప్పున పెంచుతూ ప్రస్తుతం రూ.2,750ల పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

రూ.16,02,02,500ల నగదు పంపిణీ

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, మిడుతూరు, కొత్తపల్లి మండలాల పరిధిలో ఈనెల 34,909 మంది పింఛన్ మంజూరు కాగా రూ.8,72,72,500ల నగదు పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల పరిధిలో 29,172 మంది పింఛన్ దారులుండగా వారికి రూ. 7,29,30,000ల నగదు మంజూరు అయింది. రెండు నియోజకవర్గాల పరిధిలో 64,081 మంది లబ్ధిదారులుండగా వారికి రూ.16,02,02,500ల నగదు అందజేశారు. తొలిరోజు 82.5 శాతం పంపిణీ చేయగా



కర్నూలు ఆసుపత్రిలో రంగస్వామికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

జూపాడుబంగ్లా మండలంలో 88.09 శాతం పంపిణీ చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది.

అర్హత ఉంటే చాలు పింఛన్ ఇంటికే వస్తుంది

గతంలో వయోభారం మీదపడిన అవ్వా, తాతలకు ఒంటరిగా జీవించే అక్కా, చెల్లెమ్మలకు, గీతకార్మికులు, చర్మకారులు, చేనేతలకు పింఛన్ అందేదికాదు. పలుకుబడి ఉన్న వారికి, పైసలు ఖర్చుచేసేవారికి మాత్రమే పింఛన్‌లు మంజూరయ్యేవి. జగనన్న సీఎం అయ్యాకా ఎవ్వరి సహాయం, ఎలాంటి పలుకుబడి లేకున్నా 60ఏళ్ల వయస్సుంటే చాలు ఇంటికే వలంటీర్లు వచ్చి దరఖాస్తు చేయించి, పింఛన్ మంజూరు చేయిస్తున్నారు. అదే టీడీపీ పాలనలో కొత్తగా పింఛన్ కావాలంటే ఆ పార్టీ నాయకులకు ముడుపులు సమర్పించుకోవాల్సి ఉండేది. ఇప్పుడు పైసా ఖర్చులేకుండా ఇంటికే పింఛన్ వస్తుండటంతో అర్హులైన అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆపద్బాంధవులు.. వలంటీర్లు

వెలుగోడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనులేకుండా నేరుగా లబ్ధిదారుల గడప వద్దకే పింఛన్ అందుతుంది. పింఛన్ దారులు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతుంటే ఆయా ఆసుపత్రులకు వెళ్లి వలంటీర్లు పింఛన్ల నగదును అందజేస్తున్నారు. వేల్పనూరు గ్రామానికి చెందిన వలంటీర్ జ్యోతి కర్నూలు వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగస్వామికి పింఛన్ సొమ్ము అందించగా, అదే గ్రామానికి చెందిన మరో వలంటీర్ లక్ష్మీదేవి నంద్యాలకు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వద్దుడు ఏసన్నకు పింఛన్ నగదును అందజేసింది. జగనన్న ఆశయం మేరకు తాము మహిళలమైనప్పటికీ, ఆస్పత్రులకు వెళ్లి మరీ పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. ఆపద సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమకు సకాలంలో పింఛన్ అందించి అవసరాలు తీర్చారని, సీఎం జగనన్నకు, వలంటీర్లకు లబ్ధిదారుల కుటుంబీలకు కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో పింఛన్ కోసం పడిగాపులు కాసేవాళ్లం



సీఎం జగన్ సార్ పింఛన్ ప్రతి ఏటా రూ.250లు పింఛన్ పెంచుకుంటూ పోతూ ప్రస్తుతం రూ.2,750 పింఛన్ ఇస్తున్నారు. గతంలో పింఛన్ కోసం సచివాలయం వద్ద ఐదారు రోజులు పట్టేది. జగన్ సీఎం అయ్యాక ప్రతినెల 1వ తేదీనే ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ నగదు ఇస్తున్నారు. దీంతో పింఛన్‌కోసం పడిగాపులు కాసేబాధలు తప్పాయి.

– చిత్తారి రామచంద్రుడు, జూపాడుబంగ్లా

బాధలు తప్పాయి



నాకు నెలకు రూ.2,750లకు పింఛన్ వస్తుంది. పొలం పనులకు వెళ్లేందుకు శరీరం సహకరించటం లేదు. ప్రభుత్వం ఇచ్చేపింఛన్ తోనే ఎలాగోలా నెట్టుకొస్తున్నాను. గతంలో ఒకటోవ తేదీ వచ్చిందంటే పింఛన్ కోసం ఐదో తేదీ వరకు పొలం పనులు మానుకొని పింఛన్ ఎప్పుడిస్తారా అని గ్రామ పంచాయతీ వద్ద తిండీ తిప్పలు మానుకొని పడిగాపులు కాసేవారం. జగన్ వచ్చాకా ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ నగదు ఇవ్వటంసంతోషంగా ఉంది.

– జంబులమ్మ, జూపాడుబంగ్లా

నూతన లిఫ్టులకు ప్రతిపాదనలు పంపుతాం

జూపాడుబంగ్లా: నూతన ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంటు ఈఈ మహబూబ్, డీఈ కేశవరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మండ్లెం గ్రామంలో రైతులు చేపట్టిన జలదీక్ష శిబిరాన్ని సందర్శించి రైతులతో చర్చించారు. అనంతరం మండ్లెం పొలాల్లోకి వెళ్లి బీడుభూములను పరిశీలించారు. గ్రామాల వారిగా ఉన్న బంజరుభూముల వివరాలు, సర్వేనెంబర్లు, రైతుల పేర్లు వాటికి సంబంధించిన రెవెన్యూ మ్యాప్ లను అందజేయాలని రైతులను కోరారు. బీడుభూములకు సంబంధించిన సమగ్ర వివరాలు అందజేస్తే కలెక్టర్ ఉత్తర్వులతో నీటివినియోగం నిమిత్తం హైడ్రాలికల్ క్లియరెన్స్ కోసం ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ఎకరాకు నీరివ్వడానికి కనీసం రూ.1.5లక్షల వ్యయమవుతుందని, ఈ లెక్కన 5వేల ఎకరాలకు సాగునీటిని అందించాలంటే కనీసం రూ.75కోట్ల నిధులు అవసరం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఈ షబ్బీర్, టెక్నికల్ అసిస్టెంటు సాంబశివుడు, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సీపీఐ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.



సాగునీరు అందించాల్సిన భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ, రైతులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మిడుతూరు: గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించి ఆలయ పుష్కరిణిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల సమయంలో అనుమానిత వ్యక్తులపై దృష్టి పెట్టాలని ఎస్‌ఐ మారుతిశంకర్‌కు ఆదేశించారు. పార్టీలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో కలిసిమెలసి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. మండలంలోని రోళ్లపాడు అభయారణ్యం, నంద్యాల, కర్నూలు జిల్లా పుణ్యక్షేత్రాల విశిష్టతపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి సూచించారు. గురువారం వారు మండలంలోని మండ్లెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించి విధులకు హాజరైన వారి వివరాలు తెలుసుకొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సకాలంలో హాజరుకావటంతో పాటు ఫేషియల్ యాప్‌లో అటెండెన్స్ వేయడంతో పాటు రిజిష్టర్‌తో తప్పనిసరిగా హాజరువేయాలని సూచించారు.

ఆధార్ సేవా కేంద్రం తనిఖీ

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న మొబైల్ ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకొని ఆధార్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. మండ్లెం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌సెంటర్‌ను ఎంపీడీఓ, ఈఓపీ ఆర్డీ తనిఖీ చేశారు. ఈనెల 5న పారుమంచాల, తూడిచెర్ల 6న తరిగోపుల, తాటిపాడు, 9, 11తేదీల్లో తంగడంచ, 10న పోతులపాడు గ్రామసచివాలయాల్లో ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు వారు తెలిపారు.

దెబ్బతిన్న పండ్ల తోటల వివరాలు తెలియజేయండి

జూపాడుబంగ్లా: ఈదురుగాలులతో కూడిన వర్షాల వల్ల దెబ్బతిన్న పండ్లతోటల వివరాలను రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సమర్పించాలని హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తంగడంచ గ్రామంలో 10ఎకరాల బొప్పాయి పంట దెబ్బతినడంతో రైతుల ఫిర్యాదు మేరకు సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంటు వెంకటేశ్వర్లు వాటిని పరిశీలించి రిపోర్టు పంపించినట్లు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అకాలవర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం జూపాడుబంగ్లాలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని

నందికొట్కూరు: జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. గురువారం పగిడ్యాల మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి మేటీలకు, గ్రామ ఐక్య సంఘాల సభ్యులకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వారందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు ఉపాధి సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు.

రైతు కుటుంబాలకు అండగా కేడీసీసీ

నందికొట్కూరు: రోడ్డు ప్రమాదంలో మరణించిన రైతు కుటుంబాలకు కేడీసీసీ బ్యాంకు అండగా ఉంటుందని మేనేజర్ సరోజమ్మ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు జనతా ఇన్సూరెన్స్ కింద ఒక్కొక్క రైతు కుటుంబానికి రూ. 2 లక్షల నగదు గురువారం పట్టణంలోని జిల్లా సహకార బ్యాంకులో అందజేశారు. ఆమె మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన షేక్ మాసంవలి కుమారుడు ఈదూర్ బాషా, తరిగోపుల గ్రామానికి చెందిన గొల్ల నడిపి చిన్నన్న కుమారుడు గొల్ల నడిపి నారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. వీరు బన్నూరు సహకార సొసైటీలో కేసీకే లోను తీసుకున్నారని చెప్పారు. ప్రమాదవశాత్తుతో మరణించడంతో మృతుల కుటుంబాలకు చెందిన నామినీలు సైదాబీ, పద్మావతమ్మలకు జనతా ఇన్సూరెన్స్ కింద నగదు అందజేశామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ చక్రధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సైదాబీకి నగదు అందజేస్తున్న కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సరోజమ్మ

బీమా పథకాలపై అవగాహన

పాములపాడు: మండల ప్రజలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ నాగేంద్రమ్మ అన్నారు. మండల కేంద్రంలో ఏపీజీబీ ఖాతాదారులకు ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనల గురించి వివరించారు. వీటిని చేసుకోవడం వల్ల ఏవరైన ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని చెప్పారు. కేంద్రప్రభుత్వం పేదప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వైష్ణవి, శంకర్ రావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సోమయాజులపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బండిఆత్మకూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం సోమయాజులపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల ఇంటి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఇంటి స్థలాలు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఇంటి స్థలాలు మంజూరయ్యేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఇచ్చిన ప్రతి హామీ అమలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇందుకోసం సచవాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. దీంతో టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, అభివృద్ధిని చేసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు టీడీపీ నాయకుల మాటలు నమ్మే స్థితిలో ఉన్నారని తెలిపారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యాక్రమం ద్వారా వారికి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించడం జరిగిందన్నారు. దీంతో ప్రజలందరు మా నమ్మకం నువ్వే జగన్ అని చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, సర్పంచి లక్కబోయిన లావణ్య, చక్రపాణి, ఎంపీటీసీ రామయ్య, పరమటూరు సహకార సంఘం చైర్మన్ శివలింగం, కాకనూరు సుబ్బయ్య, మహేశ్వరరెడ్డి , యర్రం గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిసలైన కార్యకర్తలకు టీడీపీలో అన్యాయం

ఆత్మకూరు రూరల్: పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న సిసలైన కార్యకర్తలకు టీడీపీలో తీరని అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అహమ్మద్ హుసేన్ అన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా చెప్పుకుంటున్న బుడ్డా రాజశేఖరరెడ్డి తప్పుడు ప్రచారాలతో కింది స్థాయి నాయకులు ఎదగకుండా చేస్తున్నారన్నారు. బుడ్డా కుటుంబానికి రాజకీయంగా ఎంతో సేవ చేశానని, అయినప్పటికీ తనలాంటి కార్యకర్తలను అణగదొక్కడం ఆ పార్టీతో పాటు ఆయన నైజాన్ని తెలియజేస్తోందన్నారు.

నేడు చౌడేశ్వరీ దేవి జ్యోతి మహోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి జ్యోతి మహోత్సవ వేడుకలు తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో శుక్ర, శని వారాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు బిందె సేవ, నందికోలా సేవ, రాత్రి 12 గంటలకు దిష్టిచుక్క అనంతరం అమ్మవారి గుండం వెలిగించుట, రాత్రి 2 గంటలకు జ్యోతి కార్యక్రమం, ఖడ్గసేవా తదితర కార్యక్రమాలు ఉంటయన్నారు. వైఎస్సార్ జిల్లా మొరగుడి, జమ్మల మడుగు, దొమ్మరి నంద్యాల, యాపరాల గ్రామాలకు చెందిన భక్త బృందాలచే గ్రామ పురవీధుగుండా ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకుంటారని తెలిపారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు. గురువారం పగిడ్యాల మండల కేంద్రంలోని సచివాలయ-01లో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, డిజిటల్ సహాయకులు అశోక్, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహానంది: బుక్కాపురంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మట్లాడుతూ మహానంది మండలాధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని అధ్యక్షత జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా గరుడ సేవ

మిడుతూరు: శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈఓ గుర్రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి తనకు ఎంతో ప్రీతిపాత్రమైన గరుడవాహనంపై గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



గరుడవాహనంపై ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఈశ్వరస్వామి ప్రభోత్సవం



ఉత్సవమూర్తులకు నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి తిరునాలలో భాగంగా రెండవరోజు ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు భక్తులు కాయా, కర్పూరం సమర్పించి విశేషపూజలు చేసుకున్నారు.

కల్యాణం.. కమనీయం

గువ్వలకుంట్ల గ్రామంలోని శివాలయంలో ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా బుధవారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. గ్రామపెద్దలు, కమిటీ సభ్యుల సమక్షంలో ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రి ఉదయం నుంచి శివపార్వతులకు కుంకుమార్చన, పుష్పార్చ, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. రాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలాకు నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం కల్యాణ తంతు జరిపించారు.

విశ్వమాత ఆలయంలో చండీ శాంతి హోమం

కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట గ్రామశివారుల్లోని విశ్వమాత ఆలయంలో చతుర్థ వార్షికోత్సవంలో భాగంగా రెండవరోజు గురువారం ఆలయంలో ఆలయ వ్యవస్థాపక పురోహితులు బాణాల లక్ష్మీనారాయణ ఆచార్యులు చండీ, శాంతి హోమాలను నిర్వహించారు. మూల విరాట్‌కు ప్రభాత సేవా, అభిషేకములు, పంచసూక్త రుద్ర పారాయణ హోమములు, మహానైవేద్యం, మంగళ హారతి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా సాయంకాల సమయంలో ప్రదోష పూజలు, లలితా సహస్తనామ పారాయణ హోమములు, కూష్మాండబలి, మహానైవేద్య మంగళహారతి, తీర్థప్రసాదములు, రాత్రి నందికుంట, ఎదురుపాడు, గ్రామాల వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు.



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతిష్ఠాపన విగ్రహాలకు జలాభిషేకం



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న పురోహితులు

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం రెండో రోజు విగ్రహాలకు జలాభిషేకం చేశారు. పురోహితుల ఆధ్వర్యంలో వేదపారాయణం, దివ్య ప్రబంధపారాయణం, యాగశాల ప్రవేశం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ నెల 7వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లకు కృపకు పాత్రులు కావాలని కోరారు.